సాక్షి
ములుగు
శుక్రవారం | 10 | ఫిబ్రవరి | 2023



యథేచ్ఛగా మట్టి దందా..
తవ్వుకో.. సొమ్ము చేసుకో.. అనే చందంగా మట్టి అక్రమ వ్యాపారం యథేచ్ఛగా కొనసాగుతోంది. రాత్రికి రాత్రే మట్టి వ్యాపారులకు కాసులు కురిపిస్తోంది.
- 8లో▸



సంఘటిత శక్తికి సాక్ష్యం
వారంతా గ్రామీణ పేద మహిళలు.. రోజువారీ వ్యవసాయ కూలీలు. అయితేనేం అంతా ఒక్కటయ్యారు. సంఘటితంగా నిలిచారు.
- 8లో▸

గరిష్టం/కనిష్టం
34.0^0 / 18.0^0

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. చలి తీవ్రత కాస్త ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

ఎస్ఎస్‌తాడ్వాయి: కంటి వెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్ఓ అల్లెం అప్పయ్య అన్నారు. మండల పరిధిలోని మేడారం గ్రామపంచాయతీలో గురువారం నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. శిబిరంలో ఎంత మంది కంటి పరీక్షలు చేసుకున్నారని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యాధికారులు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. 18 సంవత్సరాల పైబడి వారందరికీ కంటి పరీక్షలు చేయాలన్నారు. దృష్టిలోపం ఉన్నవారికి కళ్లద్దాలు వెంటనే ఇవ్వాలని, అవసరమైన వారికి ప్రెస్క్రిప్షన్ గ్లాసెస్ తెప్పించాలని సిబ్బందిని ఆదేశించారు. అంధత్వ నివారణకు అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, యువకులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్ఓ క్రాంతికుమార్, తాడ్వాయి వైద్యాధికారి చిరంజీవి, హెచ్ఈఓ సమ్మయ్య, సూపర్‌వైజర్ సరస్వతి, డాటా ఎంట్రీ ఆపరేటర్ అనిల్, ఆప్తామెట్రిస్టు సాయిప్రియ, హెల్త్ సూపర్‌వైజర్ ఖలీల్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏకకాలంలో రైతుల రుణాలు మాఫీ చేయాలి



వెంకటాపురం(కె): ఏక కాలంలో రైతుల రుణాలు మాఫీ చేసేందుకు బడ్జెట్‌లో నిధులు పెంచాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎండి.గఫూర్ పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో గురువారం సంఘం మండల కమిటీ సమావేశం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చిట్టెం ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గఫూర్ పాషా మాట్లాడారు. 2018 ఎన్నికల సమయంలో రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ చేస్తామని ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నకిలీ, నాణ్యత లేని విత్తనాల వల్ల ఏటా 4, 5 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతింటున్నాయని తెలిపారు. వాటికి ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలన్నారు. బడ్జెట్‌లో వ్యవసాయా రంగాని నిదులు రెట్టింపు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సామ చంద్రారెడ్డి, కంటెం సత్యం, బోగట విజయ్‌కుమార్, తోట నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరానికి ప్రత్యేక బస్సులు

భూపాలపల్లి రూరల్: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తుల సౌకర్యార్థం కాళేశ్వరానికి ఈనెల 17నుంచి 19వరకు ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడపనున్నట్లు భూపాలపల్లి ఆర్టీసీ బస్ డిపో మేనేజర్ ప్రతిమరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హనుమకొండ నుంచి 20బస్సులు, భూపాలపల్లి నుంచి 10బస్సులు, కాటారం నుంచి ఐదు బస్సులు నడిపించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆయిల్ పామ్ తోటలతో లాభాలు



భూపాలపల్లి రూరల్: ఆయిల్‌పామ్ తోటలతో చాలా లాభాలు ఉంటాయని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సంజీవరావు అన్నారు. ఆయిల్ పామ్ సాగుపై గురువారం నేరేడుపల్లి గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి సువన్ ఎండీ గంధ్ర గౌతమ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వ్యవసాయ శాఖ జిల్లా అధికారి విజయభాస్కర్, ఉద్యానవన శాఖ అధికారి సంజీవరావు రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పంట వేసిన నాటినుంచి నాలుగేళ్ల వరకు ఎరువుల కోసం, పంట కోత, కూలీల ఖర్చు, గెలల రవాణా ఖర్చులకు ఒక హెక్టారుకు రూ.20వేల సబ్సిడీ అందుతుందన్నారు. వరదలు, తుపానులు వచ్చినా పంటలకు నష్టం ఉండదన్నారు. కోతులు, ఇతర పక్షులు, జంతువుల బెడద లేకుండా పర్యావరణానికి హితంగా ఉండి సకాలంలో వర్షాలు కురవడానికి దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఉద్యానవన శాఖ అధికారి సునీల్, మండల వ్యవసాయ అధికారి సతీష్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ విద్యాసాగర్‌రెడ్డి, సర్పంచ్‌లు, రైతు సమన్వయ సమితి సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు

- మౌలిక వసతులు కరువు
- మరుగుదొడ్ల సౌకర్యం అంతంతే..

కొత్తూరు జీపీఎస్ పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు



అపరిశుభ్రం.. అధ్వానం

సాక్షి పరిశీలన

జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కరువయ్యాయి. మన ఊరు–మన బడి కార్యక్రమంలో ఎంపిక కాని బడుల్లో సమస్యలు అనేకంగా ఉన్నాయి. పలు పాఠశాలల భవనాలు శిథిలావస్థలో ఉండగా.. పలుచోట్ల ప్రహరీలు లేకపోవడంతో విషపురుగులు సంచరిస్తున్నాయి. మరుగుదొడ్లు, టాయిలెట్ల పరిసరాల్లో చెట్ల పొదలు పెరగడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని ఓ పాఠశాలలో బుధవారం విద్యార్థిని మృతి చెందగా.. జిల్లాలోని పలు పాఠశాలలను గురువారం 'సాక్షి' పరిశీలించగా పలు సమస్యలు వెలుగులోకి వచ్చాయి.

సమస్యలకు అడ్డాగా..



పిల్లర్ల వరకే స్లేబ్ వేసి వదిలేసిన భవనం

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ఆకుల వారిఘణపురం మానసపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల సమస్యలకు అడ్డగా మారింది. పాఠశాలలో ఐదేళ్ల క్రితం పాత భవనం కూల్చివేసి కొత్త భవనం నిర్మించేందుకు సర్వశిక్ష అభియాన్ కింద రూ. 40 లక్షల నిధులు అధికారులు మంజూరు చేశారు. ఈ క్రమంలో గతంలో ఉన్న భవనాన్ని కూల్చి వేయడంతో పాటు ప్రహరీని సైతం కూల్చివేశారు. ఇప్పుడు కేవలం నాలుగు పిల్లర్ల వరకు స్లేబ్ వేసి వదిలేశారు. దీంతో పశువులు, కుక్కలు, విష కీటకాలు పాఠశాల ఆవరణతో తిరుగుతున్న పరిస్థితి. 30 మంది చదువుకుంటున్న పాఠశాలలో ఒకే మరుగుదొడ్డి ఉండడంతో ఒకరి తర్వాత మరొకరు వెళ్లాల్సిన దుస్థితి. పాఠశాల ఆవరణ అంతా చెత్తాచెదారంతో ఉంటుంది. నీటి వసతి, వంట షెడ్డు కూడా లేకపోవడంతో ఇంటి దగ్గర వంట చేసుకుని వస్తున్నారు.

పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం



జెడ్పీ ఉన్నత బాలికల పాఠశాలలో మరుగుదొడ్ల చుట్టూ పిచ్చి మొక్కలు

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల చుట్టూ చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు పెరిగాయి. బాలికల పాఠశాలలో 78 మంది విద్యార్థినులు ఉండగా టాయిలెట్స్ 5 మాత్రమే ఉన్నాయి. సరిపడా మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదే విధంగా బాలుర పాఠశాలలో 106 మంది విద్యార్థులు ఉండగా టాయిలెట్స్ మాత్రం 4 ఉన్నాయి. అవి కూడా అపరిశుభ్రంగా ఉన్న పరిస్థితి.

జిల్లాలోని పాఠశాలల వివరాలు

	పాఠశాలలు	విద్యార్థులు
ప్రైమరీ స్కూల్స్	268	9,269
యూపీఎస్	45	2,795
హైస్కూల్స్	40	5,223
మొత్తం	353	17,287



ప్రాథమిక పాఠశాలలో..



మొట్లగూడెం పాఠశాలలో చెత్తను ఊడుస్తున్న ఉపాధ్యాయురాలు

ఆరుబయటకే..

మంగపేట: మండల పరిధిలోని రాజుపేట పంచాయతీ పరిధిలోని కొత్తూరు జీపీఎస్ పాఠశాలలో మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. పాఠశాలలో 40 మంది చదువుతున్నారు. వీరు ఒంటికి, రెండుకు వెళ్లాలంటే పక్కనే ఉన్న ముసలమ్మ వాగుకు వెళ్లాల్సిన దుస్థితి. పాఠశాలల్లో చెత్తాచెదారం తొలగింపు పనులను జీపీ సిబ్బందికి అప్పగించిన వారు చేయకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. మొట్లగూడెంతో పాటు పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులే పాఠశాలల ఆవరణాలను శుభ్రం చేసుకుంటున్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

- ఐటీడీఏ పీఓ అంకిత్
- వైద్యాధికారులతో పీఓ సమీక్ష



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ అంకిత్

ఏటూరునాగారం: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లపై ప్రజలకు, రోగులకు నమ్మకం కలిగే విధంగా వైద్యులు, సిబ్బంది మెరుగైన సేవలు అందించాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. మండల కేంద్రంలోని ఐటీడీఏలో వైద్యాధికారులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం పీఓ మాట్లాడుతూ గర్భిణుల వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపర్చడం, ఇమ్యూనైజేషన్ టీకాలు కార్యక్రమం శాతాన్ని పెంచాలని కోరారు. టీబీ రోగులకు పోషణ ఖర్చులు డీబీటీ ద్వారా అందజేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో తగినన్ని మందులు, డెంగీ, మలేరియా టెస్టింగ్ కిట్స్ అందుబాటులో ఉండాలన్నారు. కంటి వెలుగు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ అప్పయ్య, డిప్యూటీ డీఎంహెచ్ఓ విపిన్, ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్ఓ క్రాంతికుమార్, ప్రోగ్రాం ఆఫీసర్లు రవీందర్, వెంకటేశ్వర్లు, పవన్‌కుమార్, ఎన్‌హెచ్ఎం ప్రోగ్రాం మేనేజర్ మహేందర్, వైద్యాధికారులు నరేష్, సుకుమార్, మధు, చిరంజీవి, రంజిత్, యమునా, సుమలత, భాగ్యశ్రీ, శ్రీకాంత్, మధుకర్, నిఖిల్, ఉషారాణి పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిపై సుమోటోగా కేసు నమోదు చేయాలి

- ప్రగతిభవన్ ప్రజల ఆస్తి
- మాజీ ఎంపీ సీతారాంనాయక్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ సీతారాంనాయక్

ఏటూరునాగారం: పాదయాత్ర సమయంలో ములుగులో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రగతిభవన్‌ను నక్సల్స్ పేల్చివేసిన అభ్యంతరం లేదని చేసిన వ్యాఖ్యలను సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకుని కేసు నమోదు చేయాలని మహబూబాబాద్ మాజీ ఎంపీ సీతారాంనాయక్ కోరారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఆర్ఎస్ పార్టీ పేరును బీఆర్ఎస్‌గా మార్చడానికి తెలంగాణ ప్రజలకు అందించిన సేవలను దేశ ప్రజలకు అందించడానికే తప్పా వేరే ఆలోచన లేదన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు ఎనలేని సేవలు చేస్తూ మన్ననలు పొందుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ వైఫల్యం మూలంగానే దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిందన్నారు. ములుగులో ఎమ్మెల్యే సీతక్క చేసిన అభివృద్ధిని చూపెట్టాలన్నారు. ప్రగతి భవన్ కేసీఆర్, కేటీఆర్‌లకు చెందినది కాదని అది ప్రజల ఆస్తి అన్నారు. విభజన చట్టంలోనే ఇచ్చిన హామీ ప్రకారం ములుగులో గిరిజన యూనివర్సిటీని ఇవ్వడంలో బీజేపీ విఫలమైందన్నారు. స్థలం చూపించినప్పటికీ ఇంకా పనులు మొదలు పెట్టలేదన్నారు. రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డీజీపీకి ఫిర్యాదు చేశామని వివరించారు.

కేసీఆర్ ఆశీర్వదిస్తే..

సీఎం కేసీఆర్ ఆశీర్వదిస్తే ఎమ్మెల్యే, ఎంపీగా పోటీలో ఉంటానని తెలిపారు. ములుగు నేను పుట్టిన జిల్లా అని తెలిపారు. నా వెంట కరుడుగట్టిన కార్యకర్తలు, ఉద్యమకారులు, నాయకులు ఉన్నారని, వారికి నేను.. నాకు వారు తోడుగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అంతటి విజయ నాగరాజు, జెడ్పీకోఆప్షన్ సభ్యుడు వలియాబీ, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య, సర్పంచ్ ఈసం రామ్మూర్తి, నాయకులు నూతి కృష్ణ, మల్లారెడ్డి, చంద్రబాబు, అల్లి శ్రీను, కొండాయి చిన్ని, ఖాజాపాషా, ధన్నపునేని కిరణ్, మహేష్, రమేష్ పాల్గొన్నారు.

లింగాపురంలో మౌలిక వసతులు కరువు

ఏటూరునాగారం: ఐటీడీఏకు కూతవేటు దూరంలో ఉన్న గిరిజనగూడెం లింగాపురంలో మౌలిక వసతులు కరువయ్యాయని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి తాటి కృష్ణ అన్నారు. మండల పరిధిలోని లింగాపురం గ్రామాన్ని బీజేపీ నాయకులు గురువారం సందర్శించారు. గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ వర్షాకాలం వస్తే స్కూల్ భవనం మొత్తం కురుస్తుందని తెలిపారన్నారు. గోగుపల్లి నుంచి లింగాపురం గ్రామానికి కనీసం రోడ్డు సౌకర్యం కూడా లేకపోవడంతో గిరిజనులు అవస్థలు పడుతున్నారని వివరించారు. గ్రామంలో ఎవరైనా జబ్బు పడితే ఎడ్లబండ్లు కూడా నడవని పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోగులను కావడిలో కట్టుకుని మోసుకుంటూ రావాల్సిన దుర్భర పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గండేపెల్లి సత్యం, మండల ప్రధాన కార్యదర్శి గద్దల హరిబాబు, నాయకులు సంపత్, జనార్ధన్, నర్సయ్య, రవి పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట పోడు రైతుల ధర్నా



కలెక్టర్ ఎదుట ధర్నా చేస్తున్న పోడుసాగుదారులు

ములుగు రూరల్: పోడు సాగుదారులు పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట గురువారం వాజేడు మండల పరిధిలోని గుమ్మడి దొడ్డి, సుందరకాలనీ గ్రామస్తులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా పోడు రైతులు మాట్లాడారు. ఏజెన్సీలో 2005 కంటే ముందు నుంచి పోడు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా అధికారులు పట్టాలు మంజూరు చేయడం లేదన్నారు. ఇప్పగూడెం రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 9లో 64ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నామని తెలిపారు. పట్టాల కోసం దరఖాస్తులు చేసుకున్నా అధికారులు సర్వే నిర్వహించకుండానే రద్దు చేస్తున్నారని తెలిపారు. అటవీ హక్కుల చట్టాన్ని అధికారులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన పోడు సాగుదారులకు వెంటనే పట్టాలు అందించి న్యాయం చేయాలని కోరారు. లేని పక్షంలో ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం పోడు రైతులు ఆర్డీఓ కూతాటి రమాదేవికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కారం సురేందర్, ప్రసాద్, శేషమ్మ, సుజాత, నాగేశ్వర్‌రావు, లక్ష్మయ్య, శ్రీధర్, రమేష్, జయంత్, పాపారావు, సమ్మక్క, పార్వతీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న సీఎం



మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

ములుగు రూరల్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు జిల్లాలోని 88 శక్తి కేంద్రాల్లో కార్నర్ మీటింగ్‌లు నేటి నుంచి 25వ తేదీ వరకు నిర్వహించాలన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సాగిస్తున్న నిరంకుశ పాలన, ప్రజా వ్యతిరేక విధానాలపై గ్రామాల్లో బహిరంగ సభలు నిర్వహించాలన్నారు. సీఎం కేసీఆర్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. ధరణిలో రైతుల భూములకు పట్టాలు రాక నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల పేర్లు మార్చి తమ పథకాలుగా చెప్పుకుంటూ కేంద్రం నిధులను దారి మళ్లిస్తూ అవినీతికి పాల్పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిరికొండ బలరాం, భూక్య రాజునాయక్, వెంకటాపురం(ఎం) మండల అధ్యక్షుడు భూక్య జవహర్‌లాల్, కొత్త సురేందర్, మహేందర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమానికి పీఆర్టీయూ కృషి



జెండాను ఆవిష్కరిస్తున్న సత్యనారాయణ

ములుగు రూరల్: తెలంగాణ ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్(పీఆర్టీయూ టీఎస్) ఉపాధ్యాయుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తుందని సంఘం జిల్లా అధ్యక్షుడు దేవులపల్లి సత్యనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలో సంఘం ఆవిర్భావ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. డీఈఓ కార్యాలయం ఎదుట నిర్వహించిన వేడుకల్లో ఆయన సంఘం జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. 1971 ఫిబ్రవరి 9న సంఘం ఆవిర్భవించిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పీఆర్సీ 30 శాతం, ఫిట్మెంట్ ఈహెచ్ఎస్, బదిలీలు, ప్రమోషన్స్ సంఘం ద్వారానే సాధించుకున్నామని వివరించారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులు సున్నం రాజిరెడ్డి, సుంకరి సంపత్, అజ్మీర సమ్ములు, బాసాని రాంమూర్తి, మిద్దెమీది సాంబయ్య, కుతుబుద్దీన్, చాగర్ల ఐలయ్యలను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి యాకూబ్‌రెడ్డి, రాష్ట్ర బాధ్యులు ధర్మయ్య, సానికొమ్ము ముకుందరెడ్డి, గోవిందరావుపేట, ములుగు మండలాల అధ్యక్షులు నాగేశ్వర్‌రావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

'ఆపన్నహస్తం' అందిస్తా!

హాథ్ సే హాథ్ జోడో యాత్రలో రేవంత్ భరోసా

- మానుకోట జిల్లాలో రెండోరోజు సాగిన యాత్ర
- మిర్చి కల్లాల వద్ద, పత్తి రైతులతో మాటామంతి
- అసంపూర్తి డబుల్ బెడ్రూం ఇళ్ల పరిశీలన



మరిపెడ శివారులోకి వచ్చిన రేవంత్‌రెడ్డి యాత్రకు పూలతో స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

నర్సింహులపేట/మరిపెడ రూరల్: 'మీరు అండగా ఉండండి.. నేను అంతే కృతజ్ఞతగా ఉంటా.. అందరికీ ఆపన్నహస్తం అందిస్తా'అంటూ టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ప్రజలకు భరోసా ఇచ్చారు. హాథ్ సే హాథ్ జోడో యాత్ర మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గం నర్సింహులపేట మండలం పెద్దనాగారం నుంచి గురువారం ఉదయం 11గంటలకు ప్రారంభమైంది. వందలాది మంది కార్యకర్తల మధ్య సాగిన యాత్ర గోపతండా మీదుగా మరిపెడ మండలం నీలికుర్తి స్టేజీ వద్దకు చేరింది. అనంతరం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలోని సమస్యలు తె లుసుకుంటూ.. మధ్యాహ్నం ఒంటి గంటకు బసచేసే ఆర్గగడ్డతండా సమీపానికి చేరింది. సాయంత్రం 5గంటలకు పాదయాత్ర మొదలై.. మరిపెడ పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి గృహం వద్ద ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

ధర లేదని మిర్చిరైతుల గోడు

నర్సింహులపేట మండలం కొత్తతండా గిరిజన రైతులు ఆరబోసిన మిర్చి కల్లాల వద్దకు రేవంత్‌రెడ్డి వెళ్లారు. బానోత్ లక్ష్మి– సిరియా దంపతులతో పంట పెట్టుబడి, దిగుబడి గురించి ఆరా తీశారు. ఎకరాకు రూ.లక్షకుపైగా పెట్టుబడి పెట్టామని, చీడపీడలతో పంట దెబ్బతిని ఆశించిన దిగుబడి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా మరిపెడ మండలం కుడియాతండా సమీపంలో పత్తి రైతులు తమగోడును రేవంత్‌తో వెల్లబోసుకున్నారు. స్పందించిన రేవంత్ కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఎల్లంపేట స్టేజీ సమీపంలోని తండా వద్ద నూతనంగా నిర్మిస్తున్న డబుల్ బెడ్రూం ఇళ్లను రేవంత్‌రెడ్డి పరిశీలించారు. నిర్మాణాలపై ఆరా తీశారు. తాము అధికారంలోకి రాగానే గతంలోని ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెడతామని, పార్టీ మేనిఫెస్టోలో పొందుపర్చుతామని చెప్పారు. అమీర్యాతండా సమీపంలో ట్రాలీలో వస్తున్న కూలీల వద్దకు రేవంత్ వెళ్లి మాట్లాడారు. కూలి బ్బులు సరిపోవడం లేదని, పని దొరకడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. జోడో యాత్రలో రేవంత్‌రెడ్డి గిరిజనులతో మమేకమయ్యారు. కుడియాతండా సమీపంలో లంబాడ గిరిజన మహిళలతో మాట్లాడారు. అక్కడికి వచ్చిన ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం గోవింద్రాల గిరిజన మహిళలతో కలిసి నృత్యం చేశారు. దీంతో శ్రేణులు కేరింతలు కొట్టారు.

గోడ దూకి గురుకులంలోకి..

మరిపెడ సమీపంలోని సాంఘిక సంక్షేమ పాఠశాలకు రేవంత్‌రెడ్డి వస్తున్నారనే విషయం తెలియడంతో గేట్లు వేశారు. ఆయన గోడదూకి గురుకులంలోకి ప్రవేశించారు. అక్కడ విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ క్రమంలో తమకు చాలీచాలని వేతనాలు వస్తున్నాయని ఉపాధ్యాయులు రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

పాదయాత్రలో వర్గపోరు..

కాంగ్రెస్ పార్టీ డోర్నకల్‌లోని వర్గపోరు మరోసారి బయటపడింది. రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం బస చేసిన చోటుకు రాంచంద్రనాయక్, నెహ్రూనాయక్, బలరాంనాయక్ వర్గాల కార్యకర్తలు వచ్చి ఎవరికి వారుగా తమ నాయకుడి పేరును ఉచ్చరిస్తూ నినాదాలు చేశారు. లోపల ఉన్న రేవంత్‌రెడ్డి గ్రూపు తగాదాలపై ఆరా తీసినట్లు సమాచారం.



ఎల్లంపేట స్టేజి వద్ద అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూం ఇళ్లను పరిశీలిస్తున్న రేవంత్

రెడ్యానాయక్‌ను ఓడించాలి

'సాధారణ కార్యకర్తగా ఉన్న రెడ్యానాయక్‌ను కాంగ్రెస్ పార్టీ అక్కున చేర్చుకుంది. పార్టీ టికెట్ ఇస్తే కార్యకర్తలు ఓటు వేసి గెలిపించుకున్నారు. కానీ ఆయన చేసింది ఏంటి.. భూముల కోసం కండువాలు మార్చుకున్నారు. ఆదరించిన పార్టీకి ద్రోహం చేసిన రెడ్యానాయక్‌ను ఈ సారి ఓడించాలి'అని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మల్లురవి, బలరాం నాయక్, బెల్లయ్య నాయక్, సిరిసిల్ల రాజయ్య, వేం నరేందర్‌రెడ్డి, వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, మాలతీరెడ్డి, రాంచంద్రునాయక్, నెహ్రూనాయక్, రమేష్ పాల్గొన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి పాదయాత్ర
సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు శ్రీనివాసరావు

మానసిక ఒత్తిడి లేని జీవితం అవసరం
కేయూ వీసీ తాటికొండ రమేశ్

- 10లో▸

మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు

మల్లేశ్వర్‌కు డాక్టరేట్


మల్లేశ్వర్

కేయూ క్యాంపస్: ఉస్మానియా యూనివర్సిటీ జర్నలిజం విభాగం పరిశోధకుడు, కాకతీయ యూనివర్సిటీలోని జర్నలిజం విభాగం ఇన్‌చార్జ్, అధ్యాపకుడు డాక్టర్ సంగాని మల్లేశ్వర్‌కు ఉస్మానియా యూనివర్సిటీ గురువారం డాక్టరేట్‌ను ప్రకటించింది. 'సుపరిపాలనలో మీడియా పాత్ర' అనే అంశంపై ఓయూ జర్నలిజం విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వర్‌రావు పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికిగాను మల్లేశ్వర్‌కు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. మల్లేశ్వర్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో కాకతీయ యూనివర్సిటీ నుంచి ఇప్పటికే డాక్టరేట్ పొందారు. ఈనేపథ్యంలో ప్రస్తుతం జర్నలిజం విభాగంలో పొందిన పట్టాతో ఆయన డబుల్ డాక్టరేట్ పొందినట్లైంది. మల్లేశ్వర్ ప్రస్తుతం పూలే ఆశయసాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడిగా, గత20 ఏళ్లుగా దూరవిద్యాకేంద్రం జర్నలిజం విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నారు.

అమ్మాయి డీపీతో అబ్బాయిలకు ఎర..!

- ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు

వరంగల్ క్రైం: సోషల్ మీడియాను ఆసరాగా చేసుకుని అడ్డదారిలో డబ్బులు సంపాదించాలని చేసిన యువకుల ప్లాన్ బెడిసికొట్టింది. పైడిపల్లి గ్రామానికి చెందిన సూర మహేష్, మీరపల్లి గణేష్‌లు అమ్మాయి డీపీ ఉన్న వాట్సప్ ద్వారా యువకులకు మేసేజ్ చేసి రాత్రి పూట కలుద్దామని చెప్పి, వారిని కొట్టి వీడియోలు తీసి, బెదిరించి, రెండు మొబైల్ ఫోన్లు, బైక్‌ను లాక్కుపోయారు. ఈ విషయం తెలియగానే పోలీసులు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బృందంగా ఏర్పడి నిందితులను పట్టుకొని వారి నుంచి ఫోన్లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

కాళేశ్వర దేవస్థానం జిగేల్!


విద్యుత్‌కాంతుల్లో రాజగోపురం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరస్వామి ఆలయ రాజగోపురం, ప్రకారాలకు గురువారం రాత్రి విద్యుత్ వెలుగుల కాంతులు జిగేల్‌మన్నాయి. ఈనెల 17 నుంచి 19 వరకు జరుగు మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా దేవస్థానం అధికారులు ఏర్పాటు చేశారు. దీంతో రంగురంగుల విద్యుత్ కాంతులతో కాంతులీనుతుంది. రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో ఆలయాల్లో విద్యుత్ కాంతులు విరజిమ్మనున్నాయి.

నిర్లక్ష్యం.. నాటువైద్యం

- ప్రాథమిక చికిత్స చేయకుండా ఉపాధ్యాయుడి నిర్లక్ష్యం
- నాటు వైద్యుల కోసం తండ్రి ప్రయత్నం
- పరిస్థితి విషమించి విద్యార్థిని మృతి


మన్విత

అతనో ప్రభుత్వ ఉపాధ్యాయుడు.. బడిలో విద్యార్థుల ఆలనా పాలన చూసుకోవాల్సిన పర్యవేక్షకుడు. కానీ, పాఠశాలలో ఓ విద్యార్థికి పాముకాటు వేసినప్పటికీ కనీసం ప్రాథమిక చికిత్స అందించపోగా.. అంబులెన్స్‌కు కూడా సమాచారం అందించకుండా నిర్లక్ష్యం చేశాడు. మరోవైపు బిడ్డను పాము కరిచిందని తెలియగానే ఆస్పత్రికి తీసుకెళ్లాల్సిన తండ్రి నాటు వైద్యుల కోసం వెతికే పనిలో పడ్డాడు. ఉపాధ్యాయుడి నిర్లక్ష్యం.. తండ్రి చేసిన ఆలస్యంతో ఆ బాలిక విగతజీవిగా కానరాని లోకాలకెళ్లింది. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం భట్టుతండా ప్రాథమిక పాఠశాలలో బుధవారం బాలిక మృతి ఘటనలో గురువారం పలు కొత్త విషయాలు వెలుగుచూశాయి.

వరంగల్(పర్వతగిరి): ఉపాధ్యాయుడి నిర్లక్ష్యం.. తండ్రి నాటు వైద్యం చిన్నారి ప్రాణం తీసిన ఘటన వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని చింతనెక్కొండ శివారు భట్టుతండాలో చోటు చేసుకుంది. బుధవారం భట్టుతండా పాఠశాలలో విద్యార్థిని మన్విత పాముకాటుతో మృతి చెందిన విషయం


భట్టుతండా ప్రభుత్వ పాఠశాల

తెలిసిందే. రోజులాగే బుధవారం పాఠశాలకు వెళ్లిన మన్విత మధ్యాహ్నం 11.45గంటల సమయంలో మూత్ర విసర్జనకు వెళ్లే సమయంలో పాఠశాల మెట్ల వద్ద చెప్పులు వేసుకునే సమయంలో మెట్టు కింద ఉన్న పాముపై మన్వితను కాలుపడడంతో కుడి కాలుపై రెండు చోట్ల కాటు వేసింది. దీంతో మన్విత కేకలు వేయడంతో ఉపాధ్యాయుడితో పాటు అంగన్‌వాడీ టీచర్, తోటి విద్యార్థులు మన్విత వద్దకు వెళ్లారు. అప్రమత్తమై ప్రాథమిక చికిత్స చేయాల్సిన ఉపాధ్యాయుడు కనీసం అంబులెన్స్‌కు సమాచారం అందించకుండా నిర్లక్ష్యంగా విద్యార్థిని తండ్రికి సమాచారం అందించాడు. 5వ తరగతిలో ఉన్న 'ప్రాథమిక చికిత్స' పాఠ్యాంశం ఆధారంగా విద్యార్థినికి పాము కాటు వేసిన భాగాన్ని కత్తి లేదా.. బ్లేడుతో కోసి పైభాగంలో కట్టుకట్టి 108కు సమాచారం అందించాలి. కానీ, ఉన్నత చదువులు చదివిన ఉపాధ్యాయుడు కనీసం ప్రాథమిక చికిత్స అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 11.45కు ఘటన జరగ్గా.. సైతం రెండు గంటల ఆలస్యంగా 2గంటల సమయంలో సమాచారం అందించినట్లు విద్యార్థిని తండ్రి మోహన్ పేర్కొన్నారు.

నాటు వైద్యుల కోసం తండ్రి యత్నం..

తండ్రి మోహన్ చుట్టు పక్కల ఉన్న నాటు వైద్యులను సందర్శించి అక్కడ నాటు వైద్యం అందకపోవడంతో నర్సంపేటలోని బానోజీపేటకు నాటువైద్యం కోసం తీసుకెళ్లాడు. అక్కడ నాటు వైద్యం చేసిన తదుపరి అమ్మాయి మృతి చెందినట్లు స్థానికుల సమాచారం. కాగా, ఆస్పత్రికి తరలించకపోవడం, నాటు వైద్యం చేయించాలనే ఆలోచన రావడం కూడా పాప ప్రాణం తీసిందని పలువురు ఆరోపిస్తున్నారు. అయితే మన్వితను ఏ పాము కాటు వేసిందో తెలియకుండానే తండ్రి నాటు వైద్యం కోసం పలువురి వద్దకు తిప్పాడు. అంతలోనే మోహన్ తమ్ముడు సుమన్ మన్వితను కరిచింది తాచు పాము అని తెలుసుకుని మోహన్‌కు సమాచారం అందించగా అతను నాటువైద్యం చేయించే క్రమంలో పాప మృతి చెందినట్లు తెలిసింది. అయితే భట్టుతండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోనే అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేశారు. రూంలో కోడి గుడ్లను ఉంచడంతోపాటు పిల్లలు తిన్న గుడ్లు, వ్యర్థాలను బయట వేయడం వల్ల పాము కోడిగుడ్ల కోసం తరచూ వస్తుందని, గతంలో కూడా రెండు పాములను చంపినట్లు విద్యార్థిని చిన్నాన్న సుమన్ తెలిపారు.

డీఈఓ సందర్శన..

పాముకాటుతో విద్యార్థిని మృతి నేపథ్యంలో భట్టుతండా పాఠశాలను డీఈఓ వాసంతి గురువారం సందర్శించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. పూర్తిస్థాయి విచారణ చేపట్టి నివేదిక అందించాలని ఎంఈఓ సత్యనారాయణ, మండల స్పెషల్ ఆఫీసర్ లింగారెడ్డిని ఆదేశించారు.

చెవులు కుట్టిద్దామనుకున్న రోజే.. అంత్యక్రియలు

మన్వితకు గురువారం చెవులు కుట్టించే వేడుక కోసం తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేశారు. కానీ, అంతకు ఒకరోజు ముందే చిన్నారి మృతి చెందడంతో వారంతా దుఃఖసంద్రంలో మునిగిపోయారు.

ఓరుగల్లుకు మండలి డిప్యూటీ చైర్మన్

- ఎమ్మెల్సీ బండా ప్రకాశ్ ఎన్నిక లాంఛనమే..
- రేపు నామినేషన్.. 12న ఎన్నిక



సాక్షిప్రతినిధి, వరంగల్: శాసనమండలి డిప్యూటీ చైర్మన్ పదవి ఓరుగల్లుకు దక్కనుంది. తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మన్ ఎన్నికకు గురువారం నోటిఫికేషన్ జారీ అయ్యింది. ఈనెల 11న నామినేషన్లు స్వీకరించనున్నారు. 12న మండలిలో డిప్యూటీ చైర్మన్‌ను ఎన్నుకోనున్నారు. ఈనేపథ్యంలో బీఆర్‌ఎస్ తరఫున ఎమ్మెల్సీ బండా ప్రకాశ్ ముదిరాజ్ పేరును ఆపార్టీ ఖరారు చేసింది. మండలిలో బీఆర్‌ఎస్ మెజార్టీ అధికంగా ఉన్నందున డిప్యూటీ చైర్మన్‌గా ఆయన ఎన్నిక లాంఛనం కానుంది. కాగా.. ఎంపికలో సీఎం కేసీఆర్ జిల్లా మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నాయకులతో మాట్లాడినట్లు పార్టీ వర్గాల సమాచారం. అనంతరం శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా ప్రకాశ్ పేరును ఖరారు చేసి, సమాచారం అందించినట్లు తెలిసింది.

అంచెలంచెలుగా..

1981లో మున్సిపల్ కౌన్సిలర్‌గా రాజకీయ రంగంలో అడుగుపెట్టిన డాక్టర్ బండా ప్రకాశ్ అంచెలంచెలుగా ఎదిగారు. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలున్న ఆయన 1971–72లో ఏవీవీ జూనియర్ కళాశాల స్టూడెంట్ యూనియన్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1972 నుంచి 75 వరకు వరంగల్ సీకేఎం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల స్టూడెంట్ కో–ఆర్డినేషన్ చైర్మన్‌గా పని చేశారు. 1981లో ఎంఏ (పబ్లిక్ అడ్మిస్ట్రేషన్)లో యూనివర్సిటీ మొదటి ర్యాంకు బంగారు పతకం పొందారు. 1995లో పీహెచ్‌డీ (ప్రపంచ బ్యాంకు మరియు గ్రామాభివృద్ధి) తీసుకున్నారు. 1981–84 వరకు వరంగల్ మున్సిపల్ కౌన్సిలర్, వైస్ చైర్మన్‌గా, 1982–83, 1984–85 'కుడా' సభ్యులుగా కూడా పని చేశారు. పలు స్వచ్ఛంద, విద్యా, కార్మిక, జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడా సంస్థలకు గౌరవ అధ్యక్షుడిగా, అధ్యక్షుడిగా వ్యవహరించారు. పలు విద్యా సంస్థలను స్థాపించారు.

విశ్వసనీయతకు పట్టం

టీఆర్‌ఎస్‌లో చేరిన డాక్టర్ బండా ప్రకాశ్ 2017లో టీఆర్‌ఎస్ (ప్రస్తుతం బీఆర్‌ఎస్) ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. పార్టీలో నిబద్ధత కలిగిన కార్యకర్తగా, నాయకుడిగా వ్యవహరించిన ఆయనను కేసీఆర్ ఎమ్మెల్యేల కోటా కింద ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించారు. 2018 మార్చి 23న పార్టీ తరఫున రాజ్యసభకు ఎన్నికయ్యారు. 2018–2019 వరకు ప్రాచీన స్మారక కట్టడాలపై రాజ్యసభలో సెలెక్ట్ కమిటీ సభ్యుడిగా, 2019లో రాజ్యసభలో కార్మిక చట్టాలు–సంప్రదింపుల కమిటీ సభ్యుడిగా ఉన్నారు. 2019 జూన్‌లో జరిగిన పార్టీ పార్లమెంటరీ సమావేశంలో రాజ్యసభలో టీఆర్‌ఎస్ (బీఆర్‌ఎస్) పక్ష ఉప నాయకుడిగా నియమితులయ్యారు. 2021లో జరిగిన ఎన్నికల్లో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో 16 నవంబర్ 2021న టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఖరారై, నవంబర్ 22న ఎమ్మెల్సీగా ఎన్నియ్యారు. డిసెంబర్‌లో ఎంపీ పదవికి రాజీనామా చేశారు. 12న జరిగే శాసనమండలి డిప్యూటీ చైర్మన్ ఎన్నికల సందర్భంగా పార్టీ అధిష్టానం బండా ప్రకాశ్ పేరును ఖరారు చేసింది.

> **అభ్యర్థి పేరు:** డాక్టర్ బండా ప్రకాశ్
> **వయస్సు:** 63
> **తల్లిదండ్రులు:** శకుంతల, సత్యనారాయణ
> **భార్య:** అనిత
> **చిరునామా:** హనుమకొండ

సంఘటిత శక్తికి సాక్ష్యం

- రూ.20 పొదుపు.. రూ.1.67 కోట్ల మదుపు
- మినీ బ్యాంకుగా భారతి మహిళా సంఘం
- నేడు 30వ వార్షికోత్సవం

దుగ్గొండి: వారంతా గ్రామీణ పేద మహిళలు.. రోజువారీ వ్యవసాయ కూలీలు. అయితేనేం అంతా ఒక్కటయ్యారు. సంఘటితంగా నిలిచారు. పైసా పైసా పొదుపు చేసి ఓ మినీ బ్యాంకుకంటే మిన్నగా నిధులు కూడబెట్టారు. బ్యాంకుల కంటే అతి తక్కువ వడ్డీతో లక్షల రూపాయలు అప్పుగా ఇస్తున్నారు. 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నేడు వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలంలోని నాచినపల్లిలో 1993వ సంవత్సరంలో గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ నాగవెల్లి అరుణ సారథ్యంలో భారతి మహిళా పొదుపు సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. నెలకు రూ.20 పొదుపుతో 75 మంది సభ్యులు సంఘంగా ఏర్పడ్డారు. నాటి నేటి వరకు వెనుదిరిగి చూడకుండా 775 మంది సభ్యులతో 30 ఏళ్ల పూర్తి చేసుకున్నారు. గ్రామ నడిబొడ్డున భవనం నిర్మించుకున్నారు. రూ.కోటి67లక్షల105 రూపాయలు నిల్వతో ఓ మినీ బ్యాంకుకు మించి తీర్చిదిద్దుకున్నారు. సభ్యులకు డబ్బులు అవసరం ఉంటే బ్యాంకు కంటే అతి తక్కువ వడ్డీతో (75పైసలు) రూ.1.50లక్షల వరకు అప్పుగా ఇస్తున్నారు. ఏ ప్రభుత్వంతో గాని ప్రభుత్వ సంస్థతో గాని, ఏ పాలకుడి అండదండతో కాకుండా నేరుగా అందరూ ఐక్యత చాటుకుని చేయి చేయి కలిపి ఆదర్శంగా నిలిచారు.. నాచినపల్లి మహిళలు.


సంఘం వ్యవస్థాపకురాలు అరుణను సన్మానిస్తున్న మహిళలు(ఫైల్)

బిడ్డ చదువుకు రూ.1.11లక్షలు తీసుకున్నా..



నా కూతురుకు మూడేళ్ల క్రితం మెడిసిన్ సీటు వచ్చింది. మావద్ద ఉన్న డబ్బు సరిపోకుంటే సంఘంలో అప్పు కోసం దరఖాస్తు చేసుకున్నా. పాలకవర్గ సభ్యులు 75 పైసల వడ్డీతో రూ.1.11లక్షలు మంజూరు చేశారు. నెలకు రూ.5వేల చొప్పున అప్పు కిస్తును సులభంగా చెల్లిస్తున్నాను.

– రావుల కవిత, మహిళా సంఘం సభ్యురాలు

హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు


నిందితుడు గాలి ప్రవీణ్ కుమార్

టేకుమట్ల(రేగొండ): హత్య కేసులో నిందితుడికి మేజిస్ట్రేట్ జీవిత ఖైదు విధించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా ఒంగోలు మండలంలోని త్రోవగుంట గ్రామానికి చెందిన గాలి ప్రవీణ్ కుమార్, దుడ్డి ఏసోబు జీవనోపాధి కోసం రేగొండ మండలం రావులపల్లికి వచ్చారు. అక్కడ ఓ సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు సెంట్రింగ్ చేస్తున్న క్రమంలో తన సోదరితో అక్రమ సంబంధం నెరపుతున్నాడనే అక్కసుతో 2018 జూలై 30న దుడ్డి ఏసోబును గాలి ప్రవీణ్ కుమార్ హత్య చేశాడు. ఏసోబు బంధువు బత్తిని దనియా ఫిర్యాదుతో రేగొండ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. అప్పటి ఎస్సై సధాకర్ కేసు నమోదు చేయగా సీఐ శ్రీనివాస్ కేసు దర్యాప్తుచేసి నిందితుడిపై చార్జీ సీటు దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.శివరాజ్ వాదన, సాక్షులను విచారించిన భూపాలపల్లి జిల్లా సెషన్ కోర్టు ప్రినిసివల్ డిస్ట్రిక్ అండ్ సేషన్ కోర్టు జడ్జీ పి.నారాయణబాబు గాలి ప్రవీణ్ కుమార్‌కు జీవితఖైదు విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ కేసులో సాక్షులను ప్రవేశపెట్టిన ప్రస్తుత ఎస్సై శ్రీకాంత్ రెడ్డి, సీఐ పులి వెంకట్, కోర్టు కానిస్టేబుల్ సీహెచ్ జ్యోతి తదితరులను జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు.

వారంలో పెళ్లి.. యువకుడి ఆత్మహత్య

- ఆర్థిక ఇబ్బందులే కారణం


సురేష్(ఫైల్)

వరంగల్(పర్వతగిరి): ఆ యువకుడికి వివాహం నిశ్చయం అయింది. మరో వారం రోజుల్లో పెళ్లి జరగాల్సి ఉంది. ఇంతలోనే ఆ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని ముంజాలకుంటతండా శివారు నరేంగాతండాలో గురువారం చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. నరేంగాతండాకు చెందిన జాటోతు సురేష్(23)కు కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు ఎక్కువయ్యాయి. ఈనేపథ్యంలో ఈనెల 6న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. తండా గ్రామపంచాయతీ కారోబార్‌గా విధులు నిర్వహిస్తున్న సురేష్ బలవన్మరణంతో తండాలో విషాద చాయలు అలుముకున్నాయి. తండ్రి రామోజి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దేవేందర్ తెలిపారు.

అప్పుల బాధతో రైతు..

దంతాలపల్లి: మానుకోట జిల్లా దంతాలపల్లి మండలం దొనకొండ గ్రామంలో అప్పులబాధతో గురువారం ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై జగదీష్, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చొప్పరి శ్రీను (37) తమకు ఉన్న రెండెకరాల భూమిలో మిరుప పంట సాగు చేశాడు. మిరుప చేనుకు చీడపట్టగా.. పురుగుల మందులు కొనుగోలు చేసేందుకు తమకు తెలిసిన వారి వద్ద అప్పులు చేశాడు. పంటకు వివిధ రకాల పురుగు మందులు కొట్టినప్పటికీ చేను కోలుకోక అప్పులవాళ్లు డబ్బులు తిరిగి ఇవ్వాలని అడగడంతో మనస్తాపంతో గతనెల 1వ తేదీన శ్రీను పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడి సోదరుడు చొప్పరి ఉప్పలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య రమ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

హత్య కేసులో నిందితుల రిమాండ్

- వివరాలు వెల్లడించిన ఏసీపీ శ్రీనివాస్


వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ శ్రీనివాస్, సీఐ వేణు

కాజీపేట రూరల్: కాజీపేట మండలం అయోధ్యపురం శివారులో ఇటీవల జరిగిన హత్య ఘటనలో మడికొండ పోలీసులు ఇద్దరి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మడికొండ పోలీస్‌స్టేషన్‌లో గురువారం మడికొండ సీఐ వేణుతో కలిసి ఏసీపీ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. కడిపికొండ గ్రామానికి చెందిన పెసర వినయ్ తన ఆర్థిక అవసరాల కోసం అదే గ్రామానికి చెందిన తన బంధువైన జిర్ర ప్రదీప్‌కుమార్ వద్ద నాలుగు సంవత్సరాల క్రితం రూ.5 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. అప్పు ఇచ్చిన సొమ్ము తిరిగి ఇవ్వాలని పెసరు వినయ్‌ని ప్రదీప్‌కుమార్ అడుగగా ఇవ్వకపోగా.. వాయిదాలు నిర్ణయించాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. గొడవ విషయాన్ని మనుసులో పెట్టుకున్న పెసరు వినయ్.. ప్రదీప్‌కుమార్‌ను చంపాలని నిర్ణయించుకున్నాడు. పతకం ప్రకారంగా తన స్నేహితుడైన కాసబోయిన గోపీకృష్ణ సాయంతో ఫిబ్రవరి 2వ తేదీ రాత్రి అయోధ్యపురం చర్చి వెనకాలకు ప్రదీప్‌కుమార్‌ను పిలిచి అతనిని కదలకుండా గోపికృష్ణ పట్టుకోగా వినయ్ గొడ్డలితో తల వెనక భాగంలో నరికి చంపాడు. తర్వాత వారు పారిపోయి తిరుగుతూ గురువారం డబ్బుల కొరకు వారి వద్ద ఉన్న మోటార్ సైకిల్‌ను విక్రయించేందుకు వెళ్తున్న క్రమంలో బట్టుపల్లి సెంటర్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మోటార్ సైకిల్, రెండు సెల్‌ఫోన్లు, గొడ్డలిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ శ్రీనివాస్ వెల్లడించారు. ఈ సమావేశంలో ఎస్సైలు నర్సింహారావు, దివ్య పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

నెక్కొండ: వేలాడుతున్న విద్యుత్ వైర్లు తగిలి ఓ గిరిజన రైతు విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలో గురువారం జరిగింది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని గొల్లపల్లి గ్రామ శివారు మూడు తండా జీపీకి చెందిన మూడు జైత్యా (జెత్తురాం) (58) తన పొలంలో నాటు అనంతరం ఇనుప గొర్రును తీసుకొని వెళ్తుండగా వేలాడుతున్న విద్యుత్ వైర్లు తగిలాయి. దీంతో ప్రమాదవశాత్తు విద్యుత్తు షాక్‌కు గురై అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమార్తెలు రజిత, కల్పన ఉన్నారు. బాధిత రైతు కుటుంబ సభ్యుల నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై సీమాఫర్హీన్ తెలిపారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో రైతు బలయ్యారని తండావాసులు ఆరోపిస్తున్నారు.

యథేచ్ఛగా మట్టి దందా..

- బొల్లికుంటలో ఇష్టారాజ్యం
- మైనింగ్ శాఖ ఆదాయానికి గండి
- చూసీ చూడనట్లు వదిలేస్తున్న అధికారులు


ట్రాక్టర్‌లో అక్రమంగా తరలిస్తున్న మొరం

మామునూరు: తవ్వుకో.. సొమ్ము చేసుకో.. అనే చందంగా మట్టి అక్రమ వ్యాపారం యథేచ్ఛగా కొనసాగుతోంది. రాత్రికి రాత్రే మట్టి వ్యాపారులకు కాసులు కురిపిస్తోంది. ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు, తక్కువ ధరకు కొనుగోలు చేసిన ప్రైవేట్ వ్యక్తుల పట్టాభూముల్లో నుంచి మొరం మట్టి వ్యాపారులు ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేస్తూ జేబులు నింపుకుంటున్నారు. భూ యజమానులతో ఒప్పందాలు చేసుకుని మైనింగ్, రెవెన్యూ అనుమతులు లేకుండా పగలు, రాత్రి మట్టి తరలిస్తున్నారు. ప్రధానంగా బొల్లికుంట గ్రామంలో ఓ మొరం వ్యాపారి గ్రామ పరిసరాల్లోని పట్టాభూముల్లో అక్రమంగా తవ్వకాలు చేస్తున్నా.. సంబంధిత మైనింగ్, పోలీస్, రెవెన్యూ యంత్రాంగాలు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రెచ్చిపోతున్న మట్టిమాఫియా..

శుభ ముహూర్తాలు వచ్చాయి. ఇదే అదను అన్నట్లుగా మట్టి మాఫియా రెచ్చిపోతోంది. రైల్వేగేట్ ప్రాంతంలో ఇళ్లు నిర్మాణాలు ఎక్కువగా కొనసాగుతున్నాయి. ఈనేపథ్యంలో మట్టి వ్యాపారులు మట్టి రేట్లను భారీగా పెంచారు. వ్యాపారులు రాత్రికి రాత్రే ఇళ్ల పునాదులు, వెంచర్లకు మట్టిని తరలించి లక్షల రూపాయులను దండుకుంటున్నారు. అంతేకాదు విలీన గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ తవ్వకాలు చేస్తూ మొరం వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈదందా నిత్యకృత్యంగా మారింది. ఒక టిప్పర్ మట్టికి సుమారు రూ.4వేల నుంచి రూ.5వేల వరకు వసూలు చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. బొల్లికుంట కేంద్రంగా మొరం మట్టి వ్యాపారుల అగడాలు భరించలేక కొందరు గ్రామస్తులు మొరం టిప్పర్లను అక్కడక్కడ అడ్డుకుంటున్నా.. రాజకీయ నేతల అండతో నెట్టుకొస్తున్నారని సమాచారం. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు.

ఆదాయానికి గండి

ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో మట్టి తవ్వి తరలించాలంటే మైనింగ్(గనుల శాఖ)కు క్యూబిక్ మీటరుకు కొంతచొప్పున చెల్లించాలి. కానీ, అక్రమంగా మట్టిని తరలిస్తున్నా మైనింగ్, రెవెన్యూ, పోలీసుల యంత్రాంగం చూసి చూడనట్లుగా వదిలేస్తున్నారు. అనుమతి, పర్మిట్లు లేని లక్షల రూపాయల మట్టిని అక్రమంగా వెంచర్లు, ఇళ్ల పునాదాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు వాపోతున్నారు. దీంతో గనుల శాఖ రూ.లక్షల ఆదాయన్ని కోల్పోతోందని, సంబంధిత అధికారులు బొల్లికుంట పరిసరాల్లో పర్యటించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పైన కోడి పెంట.. కింద నల్లబెల్లం

- 100 క్వింటాళ్ల నల్లబెల్లం స్వాధీనం?

కురవి: డీసీఎం వ్యాన్‌లలో అక్రమంగా తరలిస్తున్న సుమారు 100 క్వింటాళ్ల నల్లబెల్లాన్ని కురవి పోలీసులు పట్టుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.. ఏపీలోని అనకాపల్లి నుంచి డీసీఎంలో పైన కోడి పెంట వేసుకుని దాని కింద నల్లబెల్లం అక్రమంగా తరలిస్తుండగా బుధవారం రాత్రి కురవి పోలీసులు మండలంలోని నేరడ సమీపంలో పట్టుకున్న ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. అలాగే కురవి శివారు బద్రుతండా వద్ద కర్నాటక నుంచి తీసుకొస్తున్న డీసీఎంలో నల్లబెల్లాన్ని తీసుకొస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. రెండు డీసీఎంలలో సుమారు వంద క్వింటాళ్ల నల్లబెల్లం ఉన్నట్లు సమాచారం. రెండు డీసీఎంలను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇదే విషయమై కురవి ఎస్సై బి.రాముునాయక్‌ను గురువారం వివరణ కోరగా బెల్లం సమాచారం వచ్చింది నిజమేనని విచారణ చేస్తున్నామన్నారు.

రెండు బైకులు ఢీ.. ముగ్గురికి గాయాలు


గాయాలపాలైన యువకులు

రాయపర్తి: ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలైన సంఘటన వరంగల్ జిల్లా రాయపర్తి మండలంలోని సన్నూరు క్రాస్‌రోడ్డులో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల తెలపిన వివరాల ప్రకారం.. మొరిపిరాల గ్రామ శివారు జానకమ్మబండ తండాకు చెందిన నవీన్, రాజు తొర్రూరుకు వెళ్లి వస్తున్నారు. ఈ క్రమంలో సన్నూరు క్రాస్ నుంచి మరో యువకుడు బైకుపై ఎదురుగా రావడంతో రెండు బైకులు ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఓ యువకుడి పరిస్థితి విషమంగా ఉండగా.. చికిత్స నిమిత్తం 108 వాహనంలో తరలించినట్లు స్థానికులు తెలిపారు.

భూకబ్జాకు యత్నం.. వ్యక్తి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ మల్లేశ్

రామన్నపేట : కాశిబుగ్గలో ఓ దివ్యాంగుడి భూమిని కబ్జా చేసేందుకు యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఇంతేజార్ గంజ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్ గురువారం తెలిపారు. కాశిబుగ్గలో దాదాపు 40 సంవత్సరాలుగా దివ్యాంగుడు సయ్యద్ అసద్, తన పూర్వికులు ఉంటున్న ఇంటిని, ఖాళీ స్థలాన్ని అదే ప్రాంతానికి చెందిన రామ యాదగిరి కబ్జా చేయాలని ప్రయత్నించాడు. తప్పుడు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్(ఎస్‌జీపీఏ) చేయించుకుని ఇల్లు, ఖాళీ స్థలం మొత్తం 250 యార్డ్స్ తనదేనని వారిని ఖాళీ చేయాలని ఇబ్బందులకు గురి చేశాడు. కోర్టులో సరైనా ఆధారాలు చూపకపోవడంతో కోర్టు కేసును కొట్టేసింది. అయినప్పటికీ సెటిల్‌మెంట్‌కు రావాలని బెదిరింపులకు పాల్పడుతున్న క్రమంలో బాధితులు ఇంజేజార్ గంజ్ పోలీసులను సంప్రదించారు. బాధితుని ఫిర్యాదు మేరకు పూర్తి విచారణ చేపట్టి తప్పుడు డాక్యుమెంట్ ద్వారా భూమి కబ్జా చేయాలని చూసిన నిందితున్ని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

వరంగల్ ఆర్వో డాటా ఆపరేటర్ ..?

కాజీపేట అర్బన్: వరంగల్ ఆర్వో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ విభాగంలో డాటా ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న రామకృష్ణను కేయూ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇటీవల అక్రమ రిజిస్ట్రేషన్లతో భూఆక్రమణకు పాల్పడినట్లు విచారణ ఎదుర్కొంటున్న కుడా మాజీ డైరెక్టర్‌కు ఇన్‌ఫోండింగ్ వ్యవహరంలో సహకరించాడనే పక్కా సమాచారంతో రామకృష్ణను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. గతనెలలో వరంగల్ ఫోర్ట్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అక్రమ నాలా కన్వర్షన్‌తో రిజిస్ట్రేషన్‌కు పాల్పడినట్లు వెల్లడవడంతో వరంగల్ ఆర్వోలో విధులు నిర్వహిస్తున్న సీనియర్, జూనియర్ అసిస్టెంట్లను మిల్స్‌కాలనీ పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. కాగా, బెయిల్ తీసుకుని తిరిగి తాము విధులు నిర్వహిస్తున్న సేమ్‌ప్లేస్‌లో మళ్లీ చేరడం చర్చనీయాంశంగా మారింది.